




ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి వరద సహాయక చర్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మం నగరంలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో వరద తాకిడికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న సీఎం

ఆందోళన వద్దు..

ఆదుకుంటాం



కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద ఎడమకాల్వను పరిశీలిస్తున్న సీఎం

- మున్నేరుకు ఇరువైపులా రిటేనింగ్ వాల్ పనులు ఈ ఏడాదే పూర్తి
- వరదలో నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.10వేల తక్షణసాయం
- ఇది ప్రకృతి ఉపద్రవం... కృష్ణా జిల్లా కంటే ఖమ్మం జిల్లాకే ఎక్కువ నష్టం జరిగింది
- ఖమ్మం జిల్లాకు ప్రధాని మోదీని రమ్మని కోరతా
- కేంద్ర ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలి
- జరిగిన నష్టంపై సర్వే చేయించి పరిహారం అందిస్తాం
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లకు రూ.5కోట్ల నిధుల కేటాయింపు
- భేషజాలకు వెళ్లకుండా బాధితులను అందరూ ఆదుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డి
- పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- కలెక్టరేట్‌లో అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష

ఖమ్మం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'మున్నేరు వరదతో సర్వం దెబ్బతిన్నది.. మీకు అండగా ఉండేందుకు, సాయం అందించేందుకే ఇక్కడికి వచ్చా.. ఆడబిడ్డల ఆవేదన కళ్లారా చూశా.. వరద నష్టాన్ని ప్రత్యక్షంగా తిలకించా..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రజల పట్ల తనకు ఎంతో ప్రేమ ఉందని, జరిగిన నష్టాన్ని అంచనా వేయించి ఆదుకుంటామని తెలిపారు. 'రాజీవ్ గృహకల్పలో స్వయంగా చూశా... టీవీ, ఫ్రిజ్ పరుపు, మంచం సర్వం నానిపోయి ఓ కుటుంబం కష్టార్జితం మొత్తం కన్నీటిపాలైంది...' అని సీఎం పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ముందు పాలేరు రిజర్వాయర్ ఎడమకాలవ గండ్లను తిలకించారు. అనంతరం ఖమ్మంరూరల్ మండలం కరుణగిరి వద్ద రాజీవ్ గృహకల్పకు వెళ్లి అక్కడ జరిగిన వరద నష్టాన్ని పరిశీలించి ప్రసంగించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.650 కోట్లతో టెండర్లు పూర్తిచేయించి ఖమ్మంలో మున్నేరు రిటేనింగ్ వాల్ పనులు ప్రారంభించామని యుద్ధప్రాతిపదికన ఈ పనులు ఈ ఏడాది పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చింది ఉపద్రవం.. 42 సెం.మీ. భారీవర్షం పడడం, 60, 70ఏళ్ల చరిత్రలో కూడా ఎప్పుడు పడలేదని పేర్కొన్నారు. వరదలో నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.10వేల తక్షణసాయంగా అందిస్తామని, ప్రాణనష్టం జరిగితే రూ.5 లక్షలు, పశుసంపదకు నష్టం జరిగితే రూ.50వేలు పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇళ్లు దెబ్బతింటే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. నష్టపోయిన ఇళ్లను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. పేదలు కష్టపడి సంపాదించుకున్న ఇంటి వస్తువులు మున్నేరులో కొట్టుకుపోవడం తనకెంతో బాధకలిగిచిందన్నారు. ఉప్పు, పప్పు, బియ్యం, తినుబండారాలు, మంచినీరు, టీవీ, ఫ్రిజ్, ఇంటిలో వస్తువులన్నీ వరద పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకస్మికంగా వచ్చిన మున్నేరు వరదలతో తమ ఇంటికి సంబంధించిన వస్తువులు, నిత్యావసరాలు తరలించే సమయం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నారని, తానే స్వయంగా వచ్చానన్నారు. పిల్లలు సర్టిఫికెట్లు పోయాయని, విద్యార్థులు ధ్రువపత్రాలు ఆధార్, ఆదాయ పత్రాలు మున్నేరులో కొట్టుకుపోవడం బాధకలిగించిందన్నారు. అధికారులతో సర్వే చేయించి న్యాయం చేస్తామన్నారు. బియ్యం, ఉప్పు, పప్పు, ఇతర నిత్యావసరాలు ప్రతి కుటుంబానికి అవసరం మేరకు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్టు తెలిపారు.

ఓదార్చుతూ... ధైర్యం చెబుతూ...



- ఖమ్మంలో వర్షంలో తడుస్తూనే సీఎం రేవంత్ పర్యటన
- వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన
- దెబ్బతిన్న ఇళ్లకు వెళ్లి బాధితులకు పరామర్శ
- కూసుమంచిలో గండిపడిన సాగర్ ఎడమకాలువ సందర్శన

6

ఖమ్మం జిల్లాకే అధిక నష్టం..

తుఫాన్‌తో ఏపీలోని కృష్ణా జిల్లాకు జరిగిన నష్టంకంటే ఖమ్మంజిల్లాకు ఎక్కువ నష్టం జరిగిందని, అందువల్ల కేంద్రం తెలంగాణకు కూడా తగిన సాయం అందించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. జరిగిన నష్టాన్ని కేంద్రానికి, ప్రధాని దృష్టికి తీసుకెళ్లాం. కేంద్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా తెలంగాణకు కూడా తగిన న్యాయం చేయాలని కోరారు. ఖమ్మంజిల్లాలో పెద్దఎత్తున పంటలు, రోడ్లు నష్టంతోపాటు వేలాది ఇళ్లు ముంపునకు గురయ్యాయని తెలిపారు. కేంద్రంనుంచి రూ.5430కోట్లు తక్షణం రాష్ట్రంలో పునరవాసానికి కావాలని ప్రధానిని కోరడం జరిగిందని, కేంద్రంలోని ఎన్డీఆర్ఎఫ్‌వలే రాష్ట్రంలో ప్రకృతివిపత్తుల నివారణకు 8 చోట్ల యూనిట్లు నెలకొల్పుతామని, తద్వారా కేంద్రంపై ఆధారపడకుండా ప్రకృతి వైపరీత్యాల తరుణంలో రెస్క్యూ ఆపరేషన్ చేయడం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఖమ్మంజిల్లాలో జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయాలని రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖలు జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయి అంచనాలువేసి నివేదికలు పంపాలని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంగా వ్యవహరించాలని, అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5లక్షలు వరదలో ఇల్లు కోల్పోయిన వారికి అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్‌కు రూ.5కోట్లు తక్షణ సాయం కింద జమ చేశామని వీటిని అవసరమైన చోట వినియోగించుకోవాలని, భద్రాద్రి జిల్లాకు కూడా రూ.5కోట్లు కలెక్టర్ ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఉదారంగా బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

మంత్రి పొంగులేటి ఇంట్లో రాత్రి బస

ఖమ్మం జిల్లాలో సోమవారం వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో సోమవారం బసచేశారు. సాయంత్రం 4.30 గంటలకు మొదలైన సీఎం పర్యటన రాత్రి 8.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్షతో ముగిసింది. అనంతరం నగరంలోని పొంగులేటి నివాసానికి వెళ్లి డిన్నర్ చేసి, అక్కడే ఉండిపోయారు. సీఎం వెంట ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. సీఎం మంగళవారం కూడా జిల్లాలోని వరద ప్రాంతాల్లో పర్యటించే అవకాశం ఉందని తెలిసింది. కలెక్టరేట్‌లో రివ్యూ అనంతరం మంత్రి తుమ్మల తనకు జ్వరంగా ఉందని ముఖ్యమంత్రితో చెప్పి తన నివాసానికి వెళ్లారు.



మంత్రులు అధికారులకు ప్రశంసలు

కలెక్టరేట్ సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో పాటు పోలీసు అధికారులను ప్రశంసించారు. గత పదేళ్ల పాలనలో మంత్రుల వలే కాకుండా ఆపద సమయంలో బాధ్యతల సాయ కార్యక్రమాల్లో నిమగ్నమై వారికి భరోసా కల్పిస్తూ సహాయ కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు.

సీఎంకు వినతిపత్రాల వెల్లువ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఎంతోపాటు పలు రాజకీయ పార్టీల నుంచి వరద బాధితులకు సాయం అందించాలని వినతిపత్రాలు అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్ బాధితులను ఆదుకోవాలని సీఎంను కోరారు. కాగా సీఎం పర్యటనలో ఇంకా ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నీరుపారుదల చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు తోటకూర శంకర్, సాధు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెట్ స్పీడ్‌తో పర్యటన

ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సోమవారం జెట్ స్పీడ్‌తో సాగింది. తొలుత ఆయన సూర్యాపేట జిల్లా పర్యటన ముగించుకొని రోడ్డు మార్గాన సాయంత్రం 4.30 గంటలకు పాలేరు చేరుకున్నారు. అక్కడ ఎడమకాల్వ గండి ప్రదేశాన్ని తిలకించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఖమ్మం శివారులోని కరుణగిరి చేరుకుని రాజీవ్ గృహకల్ప వరద బాధితులను పరామర్శించారు. తర్వాత ఖమ్మం నగరంలో బొక్కలగడ్డకు 6 గంటలకు చేరుకుని వరద ప్రాంతాలను తిలకించారు. అనంతరం 6.30 కలెక్టరేట్‌కు చేరుకుని సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఖమ్మం రూరల్ మండలం రాజీవ్‌గృహకల్ప ఏరియాలో పర్యటిస్తున్న సీఎం

బురదమయమైన బతుకులు

- మున్నేరు వరదతో తీవ్రంగా నష్టపోయిన పేదలు
- పరీవాహక ప్రాంత ప్రజలకు ఏటా కన్నీరే
- తిండి గింజల నుంచి ఇళ్ల వరకు వరదపాలు
- గతేడాది కంటే రెట్టింపు స్థాయిలో విలయం
- 'ఆంధ్రజ్యోతి'తో గోడు వెల్లబోసుకున్న బాధితులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది పరికపల్లి ఈరమ్మ కుటుంబం. ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలోని వీరి ఇల్లు మున్నేరు వరదల్లో మునిగిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. ఈరమ్మకు ఒక కూతురు ఉండగా, ఆ కూతురుకు ఇద్దరు ఆడపిల్లల సంతానం. సర్వం కోల్పోయిన వీరికి ఇప్పుడు దిక్కుతోచడం లేదు.

6

పాలేరులో వరద బీభత్సం

- సాగర్ ఎడమకాల్వకు గండ్లు
- పెద్దఎత్తున దెబ్బతిన్న రోడ్లు
- తెగిపోయిన చెరువులు,కుంటలు
- ఇంకా ముంపులోనే వరిపొలాలు





కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద దెబ్బతిన్న పెట్రోల్‌బంకు ఆవరణ

6

నేడు విద్యాసంస్థలకు సెలవు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 2: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు దీనిని తప్పనిసరిగా పాటించాలని, మండల విద్యాశాఖ అధికారులు మీమీ పరిధిలోని అన్ని పాఠశాలలకు ఆదేశాలు చేరవేసి అమలు చేయాలని డీఈవో తెలిపారు.

రోడ్డెక్కని 61 బస్సులు

ఖమ్మం-కోదాడ-విజయవాడ రూట్లలో బస్సుల బంద్

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 2: జిల్లాలో గత శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆర్టీసీ పలు రూట్లకు సర్వీసులు బంద్ చేసింది. సోమవారం ఉదయం నుంచి ఖమ్మం-కోదాడ-విజయవాడ రూట్లలో మాత్రమే సర్వీసులు బంద్ కాగా మిగిలిన అన్ని రూట్లకు బస్‌లు నడిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా మొత్తం 61 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఖమ్మం రీజియన్ నుంచి విజయవాడ, కోదాడ, జగ్గయ్యపేటకు పూర్తిగా బస్‌లను బంద్ చేశారు.



ఖమ్మం నడిబొడ్డున గల కవిరాజనగర్‌లో ఆదివారం నాటి వరద దృశ్యం

వరద నీరు వెళ్లేదారి లేకనే...

ఖమ్మంలో వరద బీభత్సానికి ప్రధాన కారణం

- అధికారుల తప్పిదాలు... అక్రమార్కుల అత్యాశ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భవంతుల కట్టడాలు
- డ్రెయినేజీలు మూసి నిర్మాణాలు, రోడ్లపైకి ర్యాంపులు
- నాలాలు మూసేసి నిర్మాణాలు

ఖమ్మం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటివరకు సుందరీకరణకు మారుపేరుగా ఉన్న ఖమ్మం నగరం ఒక్కరాత్రిలోనే మురికి కూపంగా మారింది. రెండు తెలుగురాష్ట్రాల రాకపోకలకు కేంద్రబిందువుగా ఉన్న జిల్లా కేంద్రం ఒక్కరోజు కురిసిన వర్షానికే జలదిగ్బంధం అయింది. నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటి, రెండు డివిజన్లు మినహా మిగిలిన అన్నీ ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీళ్లు నిలిచి జనజీవనం స్తంభించింది. అయితే ఖమ్మం అర్బన్ పరిధిలో శనివారం కురిసిన వర్షం కంటే కూడా పెద్దఎత్తున వర్షపాతం నమోదైన సంఘటనలు బోలెడున్నాయి. కానీ ఆయా సమయాల్లో ఎన్నడూ లేనివిధంగా నగర పాలక సంస్థ పరిధిలోని పదులకొద్దీ డివిజన్లు ముంపునకు ఎందుకు గురవుతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మున్నేరు బ్రిడ్జిలపై నుంచి నీళ్లు పొంగేస్థాయిలో వరద రావడం ఇది నాలుగోసారి కాగా, ఆ నాలుగుసార్లు కూడా (మిగతా 6వ పేజీలో)


బాధితులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల


ఖమ్మం రూరల్ మండలంలో ముంపు ప్రాంతాలను బైక్ పై పర్యటిస్తూ పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి


బాధితులను ఓదార్చుతున్న మంత్రి పొంగులేటి


తిరుమలాయపాలెం మండలంలో వరదకు ధ్వంసమైన రాకాసితండా బ్రిడ్జి


కొణిజర్ల మండలం లాలాపురం వద్ద దెబ్బతిన్న రోడ్డు

అకాల నష్టం

ఇరుజిల్లాల్లో కురిసిన అకాల వర్షాలకు అపార నష్టం జరిగింది. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తడంతో వారంతా కట్టుబట్టలతో బయటకొచ్చారు. సోమవారం వరద తగ్గడంతో ఇళ్లకు చేరుకుని సామగ్రిని శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాగా ఇంట్లోని సామగ్రి అంతా సర్వనాశనం కావడంతో బాధితులంతా కన్నీటి పర్యంతమవుతున్నారు.


ఖమ్మం 48వ డివిజన్‌లో


పాలేరు వరదనీటిల్లో కొట్టుకుపోయిన ప్రొక్లయినర్


ఖమ్మం రూరల్ రాజీవ్‌గృహకల్పలో పర్యటిస్తున్న కలెక్టర్, సీపీ


బురదమయమైన ఖమ్మం 47వ డివిజన్


మున్నేరు ఒడ్డున ధ్వంసమైన ఇల్లు


పాలేరు వరదనీటిలో కొట్టుకుపోయిన కారు


47వ డివిజన్‌లో సామగ్రి అందజేస్తున్న మేయర్, డీఎఫ్‌వో

వరద నీరు వెళ్లేదారి లేకనే...

(5వ పేజీ తరువాయి)

ఇదే రకమైన పరిస్థితులు నెలకొనడంతోపాటు యేటికేడు వరద ముప్పు తీవ్రతరమవుతున్నట్టుగా తెలుస్తోంది. కాగా గతంలో అంతకు మించిన వర్షాలు పడిన సమయంలో కొద్దీగొప్ప నష్టం ఉన్నప్పటికీ ఇంతటిస్థాయిలో జననివాసాలు ముంపునకు గురవడం గడిచిన రెండేళ్ల కాలంగానే జరుగుతున్నట్టుగా తెలుస్తోంది.

వరద వెళ్లేదారిలేకనే ముంపు

ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఖమ్మం నగరం అతలాకుతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి మున్నేరుకు వరద పెరిగిన సమయంలో మున్నేరు నదీ ప్రవాహానికి సమీపంలో ఉన్న ప్రాంతాలు మాత్రమే ప్రభావితమయ్యేవి. కానీ గతేడాది వర్షాలు కురిసిన సమయంలో ఖమ్మం నగరంలోని మరికొన్ని ప్రాంతాలకు వరద నీరు చేరుకుని ఇళ్లల్లో నీళ్లు నిలిచిపోయాయి. కాగా శనివారం కురిసిన వర్షాలకు మాత్రం ఖమ్మం నగరం మొత్తం వరదనీటితో నిండిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్నేరు నదీ ప్రవాహానికి చేరువలో ఉన్న దానవాయిగూడెం, రామన్నపేట, మోతీనగర్, వెంకటేశ్వర నగర్, రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ, పద్మావతినగర్ ప్రాంతాలు పూర్తిగా నీటమునిగిపోయాయి. ఆయా ప్రాంతాల్లో రెండు, మూడు ఫ్లోర్లు ఇళ్లు మొత్తం కనిపించని పరిస్థితి ఏర్పడింది.

అయితే మున్నేరుకు సమీపంలో లేని పాండురంగాపురం, అమరావతినగర్, ఖానాపురం, టేకులపల్లి, చైతన్యనగర్, కవిరాజ్‌నగర్, రోటరీనగర్, మమతారోడ్డు, ప్రశాంతినగర్, మధురానగర్ వంటి ప్రాంతాల్లో కూడా నడుముల్లోతు వరదనీళ్లు నిలిచాయి. వీటితోపాటుగా మామిళ్లగూడెం, రాపర్తినగర్ వంటి ప్రాంతాల్లో కూడా నీరు నిలవడం కొసమెరుపు. గతంలో ఎన్నిసార్లు మున్నేరుకు వరదలు వచ్చినప్పటికీ ఆయా ప్రాంతాల్లో అంతటిస్థాయిలో వరద నీరు నిలిచిపోవడం ఇదే తొలిసారిగా నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

వాటన్నింటికీ కారణంగా మున్నేరు తీవ్రంగా ప్రవహించడంతో వరదనీరు కలిసే అవకాశం లేని కారణాన్ని కొందరు చెబుతున్నప్పటికీ.. ఎగువనుంచి ఎగబాకిన వరదనీరు వెళ్లేదారిలేకపోవడంతో దిగువన ఉన్న ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రఘునాథపాలెం నుంచి బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్ నుంచి వచ్చే వరదనీరు మొత్తం ఖానాపురం చెరువుమీదుగా లకారం మీదుగా మున్నేరులో కలవాల్సి ఉంటుంది. మిగిలిన ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సైతం ఇదేరీతిలో బయటకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ దారులన్నీ మూసివేసిన కారణంగా ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఇళ్లకు ఎగబాకినట్టు తెలుస్తోంది. అయితే ఇంతటిస్థాయిలో నష్టం జరగడానికి కారణం సుందరీకరణ పేరుతో పార్కులు ఏర్పాటు చేసి వరద వెళ్లేందుకు దారిలేకుండా అడ్డుకట్ట వేయడం కూడా కారణమేనంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మాణాలు..

మున్నేరు నది, ఖానాపురం, లకారం వంటి చెరువులు, ఆయా చెరువులకు అనుసంధానంగా చైన్‌లింక్ కాల్వల పరిధిలో ఎలాంటి భూములున్నా సరే.. వాటికి సంబంధించి క్రయ విక్రయాలు సాగకూడదు. ఆయా ప్రాంతాల్లో వెంచర్లకు, ప్లాట్లకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు నిషేధం. కానీ సాధారణ భూములకు మాదిరే అన్నీ రకాల పనులు సాగించారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాల్సిన అధికారులు భూముల రిజిస్ట్రేషన్ల నుంచి మొదలుకుని ఇళ్ల నిర్మాణాలు, వాటికి అనుమతులు సైతం మంజూరుచేశారు. ఆయా అక్రమ నిర్మాణాల కారణంగా ఇలాంటి వరదలు వచ్చినప్పుడు ఆయా ఇళ్లకు నీరు పోటెత్తడం పరిపాటిగా మారిందన్న విమర్శలు లేకపోలేదు.

మున్నేరు పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లలో జోరుగా భవంతులు నిర్మాణాలు జరగ్గా.. నగరంలో సైతం అదేరీతిలో కాల్వలను కబ్జాచేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు నిర్మించారు. పలు అపార్ట్‌మెంట్లలో అండర్‌గ్రౌండ్ పేరుతో లోపలికి వెళ్లిన వరదనీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా సెల్లార్లు నిర్మించారు. డ్రెయినేజీలను ఆక్రమించి రోడ్లపైకి నిర్మాణాలు చేశారు. పెద్ద ఎత్తున ర్యాంపులు వేసి డ్రెయినేజీలు మూసేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మాస్టర్‌ప్లాన్‌లో బఫర్‌జోన్‌లో ఉన్న స్థలాలకు సైతం లోకేషన్లు మార్చి అనుమతులు మంజూరు చేసిన సంఘటనలు ఖమ్మం కార్పొరేషన్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉండటంతోపాటు మిగిలిన వరదనీరు సైతం బయటకు వెళ్లేందుకు మార్గం లేక కట్టలు కట్టిన కారణంగా ఆయా డివిజన్లలో నీళ్లు నిలిచిపోయినట్టుగా తెలుస్తోంది.

ఫలితంగానే మంత్రుల నుంచి మొదలుకుని జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సైతం నిద్రలు లేకుండా శ్రమించాల్సిన పరిస్థితులు ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వరదలు వచ్చిన సమయంలోనే వీటిపై దృష్టిసారిస్తే ప్రస్తుతం ఇంతటిస్థాయిలో నష్టం ఉండేదికాదన్న వాదన వినిపిస్తుంది. ఒక్క రాత్రి కురిసిన వర్షానికే ఖమ్మం నగరం పరిస్థితి ఇలా తయారైతే మున్ముందు భారీ ఎత్తున వర్షాలు పడితే ఎంతటిస్థాయిలో నష్టం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

వరద బాధితులకు అండగా ఉంటాం: మంత్రి తుమ్మల

వరద బాధితులకు ఈ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటుందని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ఖమ్మం వచ్చి వరద ప్రాంతాలను తిలకిస్తున్నారని, గతంలో విపత్తుల తరుణంలో ఏ ముఖ్యమంత్రి ఇంత త్వరగా రాలేదని, ఖమ్మంజిల్లాలో జరిగిన నష్టం చూసి వెంటనే ముఖ్యమంత్రి పరిశీలించడం ద్వారా వరద బాధితులకు అన్ని విధాల సాయం అందించడం జరుగుతుందన్నారు. మున్నేరు వరద కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిందని, ఈ విపత్తును నివారించి ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాల సాయం అందిస్తుందన్నారు.జరిగిన నష్టంపై అధికారులతో అంచనాలు వేయిస్తామని బాధితులకు ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయంచేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

అందరిని ఆదుకుంటాం: మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వం మీ కష్టాలు, కన్నీళ్లలో భరోసాగా ఉండే ప్రభుత్వమని అందరిని ఆదుకోవడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఖమ్మంరూరల్ మండలం రాజీవ్ గృహకల్ప వద్ద వరద బాధితులనుద్దేశించి ప్రసంగించారు. గతేడాదికంటే అధికంగా మున్నేరు పొంగి ప్రవహించడంతో మీరందరు వరద ముంపునకు గురై కష్టాల్లో ఉన్నారు. అందుకే స్వయంగా చూసేందుకు ఇక్కడకు ముఖ్యమంత్రితో కలిసి వచ్చామని ఇది పేదవాడి ప్రభుత్వం, అండగా ఉంటుందన్నారు. మున్నేరులో రిటైనింగ్‌వాల్స్ నిర్మించి వరద నివారణకు రూ.650కోట్లతో పనులు చేపట్టామని త్వరలో పూర్తిచేసి వరద నుంచి రక్షణ కలిపిస్తామన్నారు. గత ప్రభుత్వంవల్లే ఈ ప్రభుత్వం తప్పులు చేయదన్నారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు: ఉపముఖ్యమంత్రి భట్టి

వరద విపత్తులతో నష్టపోయిన ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఇది ప్రజాప్రభుత్వం, ప్రజల ప్రభుత్వమని అన్ని విధాల అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వరద ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గత పాలకులు ప్రజాసమస్యలు ప్రజల్లోకి వెళ్లి తెలుసుకోకుండా సోషల్‌మీడియా వేదికగా ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసే విమర్శలు తగవన్నారు. ప్రజలను ఆదుకోవడానికి ఈ ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నిస్తుందని, ప్రత్యక్షంగా ఇక్కడే ఉండి మంత్రులు అధికారులు సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం జరుగుతుందన్నారు. భారీ వర్షాలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండడంతో పెద్ద ప్రాణనష్టం జరగకుండా నివారించగలిగామని తెలిపారు. రూ.10వేల నగదు తక్షణసాయం కింద నీటి మునిగిన ఇళ్లకు అందిస్తామన్నారు.

ఓదార్చుతూ... ధైర్యం చెబుతూ..

- ఖమ్మంలో వర్షంలో తడుస్తూనే సీఎం రేవంత్ పర్యటన
- వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన
- దెబ్బతిన్న ఇళ్లకు వెళ్లి బాధితులకు పరామర్శ
- కూసుమంచిలో గండిపడిన సాగర్ ఎడమకాలువ సందర్శన

ఖమ్మం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో జోరువానలో పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు. సూర్యాపేట జిల్లాలో పర్యటన అనంతరం పాలేరు చేరుకుని, అక్కడ వరద కారణంగా పాలేరు నాగార్జునసాగర్ కాల్వకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సాయంత్రం వర్షం పడుతుండగానే ఖమ్మంరూరల్ మండలం కరుణగిరిలో వరద ప్రాంతాన్ని తిలకించారు. మున్నేరు నది ఉధృతి, బీభత్సాన్ని ముఖ్యమంత్రి స్వయంగా తిలకించారు. ఓపెన్‌టాప్ జీప్ ఎక్కి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి రాజీవ్‌గృహకల్ప కాలనీకి వెళ్లారు. అక్కడ రేవంత్‌రెడ్డి ఒక ఇంటిలోకి వెళ్లి మహిళతో సంభాషించారు. 11 అడుగులపైగా వరద వచ్చిందని, ఇంటిలో సర్వం తడిసిపోయాయని, కట్టుబట్టలతో వెళ్లామంటూ ఆవేదనతో జరిగిన నష్టం వివరించింది. ముఖ్యమంత్రి కూడా అక్కడున్న వారితో మాట్లాడి జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు.

అక్కడినుంచి ముఖ్యమంత్రి ఖమ్మం నగరం చేరుకున్నారు. మంత్రి తుమ్మలతో కలిసి ఖమ్మంలోని బొక్కలగడ్డ ప్రాంతానికి వెళ్లి వరద బాధితులను కలిశారు. అక్కడ బాధితులు నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. మున్నేరు వరదలో నష్టపోయిన ప్రతి కుటుంబానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని పూర్తిఅంచనా తర్వాత తగిన పరిహారం అందిస్తామని, ధైర్యంగా ఉండాలని కోరారు. అనంతరం వర్షంలోనే ఓపెన్‌టాప్ జీపుపై ఖమ్మం నగరంలో నష్టాన్ని పరిశీలిస్తూ కలెక్టరేట్‌కు చేరుకుని వరదనష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

పాలేరు నియోజకవర్గంలో

కూసుమంచి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో పర్యటించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి వచ్చారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో జిల్లాకు చేరుకున్న సీఎం ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిమీదుగా పాలేరు జలాశయం నుంచి వచ్చిన వరద ఉధృతిని, జరిగిన నష్టాన్ని కాన్వాయ్‌ని ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు వరద నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. నిజాం కాలంలో నిర్మించిన కాల్వలని, గతంలో చరిత్రలో ఎన్నడూ ఇంతస్థాయిలో వరద రాలేదని, లక్షన్నర క్యూసెక్కుల వరద ఒకేసారి రావడంతో తీవ్రనష్టం వాటిల్లిందని తెలిపారు.

సాగర్ కాల్వల మరమ్మతులు వెంటనే చేయించాలని సీఎం దృష్టికి తీసుకవచ్చారు. ఎడమకాల్వ మొదటిజోన్ పరిధిలో రంగులబ్రిడ్జి వద్ద, పాలేరు జలవిద్యుత్‌కేంద్రం వద్ద, మల్లాయిగూడెం అనే గ్రామం వద్ద తెగిందని మరమ్మతులు చేస్తేనే ఆయకట్టుకు నీరందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాలేరు వరద ఉధృతిపై సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మంత్రుల వెంట రాష్ట్ర గిడ్డంగులసంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మువ్వవిజయ్‌బాబు ఉన్నారు.

బురదమయమైన బతుకులు

- మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఏటా కన్నీరే

ఖమ్మం సంక్షేమ విభాగం/ఖమ్మం సాంస్కృతికం/, సెప్టెంబరు 2: మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఏటా కన్నీటి కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలు వరదల సమయంలో ముంచుకొస్తున్న ముప్పు గురించి అధికా రయంత్రాంగంతో పాటుగా తాము ఓట్లేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు కూడా కనీసం పది నిమిషాల ముందు కూడా సమాచారం ఇవ్వలేదని బాధితులు కన్నీరు పెట్టారు. ఆకస్మికంగా ఇంటిని చుట్టుముట్టిన వరదతో పిల్లలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఇంటి నుంచి బయ పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా వరద వచ్చినా ఇంత స్థాయిలో నష్టం జరగ లేదన్నారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలని సోమవారం సందర్శించిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులతో బాధితులు తమ బాధలను పంచుకున్నారు.

వరద సమాచారం ఇవ్వలేదు : మోకాటి సుగుణ

మున్నేరుకు వరద వస్తుందని కనీస సమాచారం ఇవ్వలేదు. ఒక్కసారిగా వరద ఇంటిని చుట్టూ ముట్టటంతో కట్టుబట్టలతో ఇంటో నుంచి బయటపడ్డాం. ఇంట్లో ఉన్న వస్తువులు వరదలో కొట్టుకు పోయాయి.

తిండి గింజలు బురదలో కలిశాయి: కారంగుల కౌసల్య

ఒక్కసారిగా వరద రావటంతో ఇంట్లోని వస్తువులతో పాటు ఇంటి పైన రేకులు నీటిలో కొట్టుకుపోయాయి. బియ్యం, పప్పులు బురదలో కలిశాయి. మీమంతా కట్టుబట్టలతో మిగిలాం. రూ.4లక్షల వరకు నష్టపోయాం. ఇంటి రేకులు కొట్టుకుపోవటంతో రోడ్డుపైనే ఉంటున్నాం.

చంటి బిడ్డతో బయపడ్డాం : వకజాల గోపిక

ఆకస్మికంగా వచ్చిన వరదలతో నెల రోజుల చంటి బిడ్డతో ఇంట్లో నుంచి బయటపడ్డాం. దండెం మీద దుస్తులు ఇంట్లోని సామగ్రి వరదలో కొట్టుకుపోయాయి.ఇద్దరు పిల్లలతో పునరావాస కేంద్రంలో తలదాచుకున్నాం. ఇంట్లో మాకేం మిగలలేదు.

పిల్లలే మిగిలారు: యూ. యేసుకుమారి

మా ఇంట్లో నా భర్త, నేను, మా ఇద్దరు పిల్లలే మిగిలాం. ఇంట్లో నుంచి వరద ప్రవహించడంతో ఏమీ మిగల లేదు. ఇద్దరు పిల్లలను తీసుకొని పునరవాస కేంద్రంలో నేను ఉన్నా. నా భర్త మా ఇంట్లో చేరిన బురదను శుభ్రం చేసేందుకు వెళ్లారు. రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

దిక్కులేని పక్షులమయ్యాం: పరికపల్లి ఈరమ్మ

మున్నేరు వరదతో నేను, నా కూతురు ఆమె ఇద్దరు ఆడపిల్లలు దిక్కులేని పక్షులమయ్యాం.. భర్తలేని నా కూతురు కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తోంది. వరద వస్తోందని గమనించే లోపే వరద చుట్టుముట్టింది. కట్టుబట్టలతో బయటికొంచ్చాం. ఇంట్లోని వస్తువులన్నీ పనికిరాకుండా పోయాయి. పిల్లల పుస్తకాలు కూడా పోయా యి.

మూడు కుటుంబాలను ముంచేసింది : అఫ్జల్ బీ

ఒక మాయలా వరద వచ్చి మూడు కుటుంబాలను ముంచేసింది. కూలి పనులు చేసుకొని పొట్ట పోసుకునే నేను నా ఇద్దరు కుమారులు ఒకే ఇంట్లో వేర్వేలు గదుల్లో ఉంటున్నాం. వరద మమ్మల్ని రోడ్డున పడేసింది. ఇంట్లోని సామగ్రి, బియ్యం పనికిరాకుండా పోయాయి. మాకు ఏ ఆధారమూ లేదు. మా పరిస్థితి ఏంటో అర్థం కావటం లేదు.

కట్టుబట్టలు కన్నీళ్లే మిగిలాయి : ఎస్‌కే మన్నీ

మున్నేటి వరద మా కష్టార్జితాన్ని నీళ్ల పాలు చేసింది. కష్టించి కూడబెట్టుకున్న సామగ్రి నీటిపాలైంది. మంచాలు, ఫ్రిజ్, టీవీలు ఎందుకూ పనికి రాకుడా పోయాయి. కట్టుబట్టలతో మిగిలాం..

పాలేరులో వరద విలయతాండవం

- ఇంకా ముంపులోనే వరిపొలాలు
- సాగర్ ఎడమకాల్వకు గండ్లు
- పాలేరు జలాశయానికి తగ్గిన వరద ఉధృతి




ధ్వంసమైన జాతీయ రహదారి, పాలేరు వరదనీటిల్లో కొట్టుకపోయిన ట్రాక్టర్లు

కూసుమంచి, సెప్టెంబరు 2: గత రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలు కారణంగా పాలేరు వరద విలయతాండవం చేసింది. గత మూడున్నర దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనివిధంగా పాలేరు జలాశయానికి వరద రావడంతో కూసుమంచి మండలంలోని పలుగ్రామాలకు చెందిన పరీవాహక ప్రజలు, స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రికి రాత్రే సుమారు లక్షన్నర క్యూసెక్కుల వరద వరంగల్, సూర్యాపేట జిల్లాల పరీవాహక ప్రాంతాల నుంచి వరద పోటెత్తింది. ఎక్కడ చూసినా.. నీరే కనిపించింది. సోమవారం సాయంత్రానికి వరదపోటు తగ్గింది. దీంతో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వరద కారణంగా పాలేరు-నాయకన్‌గూడెం గ్రామాల మధ్య అప్రోచ్‌రోడ్డు కొంతమేర దెబ్బతిన్నది. అలుగుల వైపు ఉన్న నాయకన్‌గూడెం వద్ద పెట్రోల్‌బంక్ పూర్తిగా కొట్టుకపోయింది. దానిపక్కనే ఉన్న సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమ వరదకు కొట్టుకపోయింది. జేసీబీ, రెండు ట్రాక్టర్లు, రెండు డోజర్లు, మరికొన్ని ద్విచక్రవాహనాలు వరదలో కొట్టుకరావడం వరద తీవ్రతకు అద్దంపడుతుంది. అదేవిధంగా అయా గ్రామాల్లో చెరువులు, కుంటలు అన్నీ తెగిపోవవడంతో పంటలన్నీ వరదకు నాశనమయ్యాయి

వరదలోనే కాలనీలు

మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం బీసీకాలనీలు, నానుతండా, ఎర్రగడ్డతండ, చౌటపల్లి, కొత్తూరు గ్రామాల్లో నివాసాలు ఇంకా నీరు నిలిచి ఉంది. పాలేరు ఏరు పరీవాహకతండాలయిన గోరీలపాడుతండ, మల్లాయిగూడెం, హట్యతండ, తుమ్మలతండ, హీరామన్‌తండ, ఒంటిగుడిసె తండాల్లో వరదనీరు నిలిచి ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధులన్నీ బురదమయంగా మారడంతో అవస్థలు పడుతున్నారు.

నీటిముంపులోనే పంటపొలాలు

పాలేరు జలాశయానికి వరదపోటు కారణంగా వివిధ గ్రామాల్లో వరిపొలాలు ఇంకా నీటిముంపులోనే ఉన్నాయి. ఈనీరు తగ్గేందుకు ఇంకా రెండురోజుల సమయం పట్టే అవకాశం ఉందని రైతులు తెలిపారు. పాలేరు, నర్సింహుల గూడెం, నానుతండ, ఎర్రగడ్డతండా, చౌటపల్లి, నర్సింహుల గూడెం గ్రామాల్లో వరిపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పైనుంచి గతంలో ఎన్నడూ లెనివిధంగా వరద రావడంతో పొలాలన్నీ కొట్టుకపోయి, సారవంతమైన భూమి పోయిందని, ఇసుక మేటలు వేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పొంగులేటి పరిశీలన

పాలేరు జలాశయానికి పోటెత్తిన వరద కారణంగా సాగర్ ఎడమకాల్వకు పడిన గండ్లను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. జలవిద్యుత్‌కేంద్రం వద్ద గండిని, కోతకు గురయిన కాల్వను, మల్లాయిగూడెం వద్ద ఎడమకాల్వ గండిని, జక్కేపల్లి వద్ద నీటమునిగిన పంటలను మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతు వెంటనే యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు.

సాగర్ ఎడమకాల్వకు రెండుచోట్లు గండ్లు

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు పాలేరు జలాశయం సమీపంలోనూ, మల్లాయిగూడెం వద్ద రెండుచోట్లు గండ్లు పడ్డాయి. దీంతో వరదనీరు పంటపొలాల్లోకి మళ్లడంతో ఇసుకమేటలు వేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గండ్లు వెంటనే మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. గండ్లను నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్ పరిశీలించారు.

నీటమునిగిన జలవిద్యుత్‌కేంద్రం

పాలేరు జలవిద్యుత్‌కేంద్రం నీటమునిగింది. పాలేరు జలాశయానికి వచ్చిన వరద జలవిద్యుత్‌కేంద్రం కాల్వలోకి పోటెత్తింది. దీంతో వరద భారీస్థాయిలో రావడంతో కాల్వ రెండుచోట్లు తెగింది. జలవిద్యుత్‌కేంద్రంలోకి నీరు పోటెత్తింది. దీంతో రెండుయూనిట్లు నీటమునిగాయి. ఈమేరకు పులిచింతల ప్రాజెక్ట్ ఎస్ఈ దేశ్యానాయక్, ఇతర అధికారులు ప్రాజెక్టును పరిశీలించారు. ఈమేరకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

పాలేరు మత్స్యపరిశోధనాకేంద్రంలో..

పాలేరు మత్స్య పరిశోధనాకేంద్రంలోనూ పాలేరు వరద నీరు పోటెత్తింది. వరదనీరు కారణంగా పాండ్లు దెబ్బతిన్నాయని సీనియర్‌సైంటిస్ట్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పరిశోధనకు ఉనయోగిస్తున్న చేపలు మృత్యువాతపడ్డాయని తెలిపారు.

భారీ వరదలకు సర్టిఫికెట్లు గల్లంతు

- ప్రభుత్వం ఆదుకోవాలని విద్యార్థుల వేడుకోలు



వరదలకు తడిసిన సర్టిఫికెట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 2: భారీ వర్షాలకు ఖమ్మం నగరంలోని మున్నేరు పొంగి ప్రవహించటంతో ధ్వంసలాపురం కాలనీలోని పలు ఇళ్లలోకి వరద నీరు భారీగా చేరింది. దీంతో అధికారులు ధ్వంసలాపురం ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశారు. సుమారు 800ల మందికి భోజనం, వాటర్, ఆశ్రయం కల్పించారు. ఈ కాలనీలో ఉండే పలువురి విద్యార్థులు సర్టిఫికెట్లు నీటిలో తడిసి కొన్ని పాడవగా, మరికొన్ని వరదకు కొట్టుకుపోయాయి. తాగేందుకు మంచినీళ్లు లేక ఇబ్బందులు పడ్డారు. మంత్రి తుమ్మల ఆదేశంతో ప్రభుత్వ అధికా రులు వెంటనే భోజనం, వాటర్‌ను ఏర్పాటు చేశారు.

డిగ్రీ, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు గల్లంతు

భారీ వరదల కారణంగా ధ్వంసలాపురం కాలనీలోని పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన పలువురి విద్యార్థుల సర్టిఫికెట్లు కొన్ని గల్లంతు కాగా మరికొన్ని పూర్తిగా బురదలో తడిసి పనికిరాకుండా పోయాయి. కాలనీలో నివసించే వడ్డెల్లి ప్రవళికకు సంబంధించిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు, వడ్డెల్లి వెన్నెలకు సంబంధించి పదోతరగతి సర్టిఫికెట్లు, గౌతంశర్మకు సంబంధించి డిగ్రీ సర్టిపికెట్లు పూర్తిగా తడిసి పనికిరాకుండా పోయాయి. కుల, ఆదాయ, ఆధార్ కార్డులు బురదలో కొట్టుకుపోయాయి.

సర్టిఫికెట్లు ఇప్పించండి

వడ్డెల్లి ప్రవళిక, డిగ్రీ విద్యార్థిని

వరద నీటితో సర్టిఫికెట్లు పనికిరాకుండా పోయాయి. అధికారులు పాత సర్టిఫికెట్ల స్థానంలో కొత్త సర్టిఫికెట్లు అందించాలి. రోజు కూలి పనులకు వెళ్లే మా తల్లిదం డ్రులు డూప్లికేట్ సర్టిఫికెట్లు తీసుకోవాలంటే ఆర్థిక స్తోమత లేదు. సర్టిఫికెట్లు లేకపోతే నా చదువు ఆగిపో తుంది. దయచేసి నా సర్టిఫికెట్లను అధికారులు వెంటనే ఇప్పించి చదువు ముందుకు సాగేలా సహకరించాలి.

వరదనీటిలో కొట్టుకుపోయాయి

గౌతంశర్మ, పదో తరగతి విద్యార్థి

ఆర్థిక పరిస్థితులు సరిగి లేని కారణంగా పదోతరగతి వరికే చదువు పూర్తిచేశా. ప్రస్తుతం ఆలయంలో అర్చకుడికి సంబందించిన వేదం నేర్చుకుంటున్న. భవిష్యత్తులో చదువుకుందామంటే పదోతరతి సర్టిఫికెట్ వరదనీటిలో గల్లంతైంది. ప్రభుత్వ అధికారులు నా పదో తరగతి సర్టిఫికెట్‌ను బోర్డు అధికారులతో మాట్లాడి ఇప్పించాలి.

68వేల ఎకరాల్లో పంట నష్టం



ఖమ్మంవ్యవసాయం, సెప్టెంబరు 2: భారీవర్షాలకు ప్రాథమిక అంచనాల ప్రకారం పంటనష్టం వివరాలను ఆదివారం వ్యవసాయ శాఖ విడుదల చేసింది. మొత్తం 68 వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందని వెల్లడించిందని తెలిపింది. పత్తి 27,639 ఎకరాలు, మొక్కజొన్న 47, పెసర660, వరి 35,590, మిర్చి 4,178 ఎకరాలు కాగా మొత్తం 46,474 మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో నష్టం జరిగిందని తెలిపారు. ఖమ్మం డివిజన్‌లో 1196 మంది రైతులకు చెందిన 2179 ఎకరాలు, కూసుమంచిలో 15,083 మందికి చెందిన 19,176ఎకరాలు, మధిరలో 22,595 మందికి రైతులకు చెందిన 35,251 ఎకరాలు, సత్తుపల్లిలో 5,001మదికి చెందిన 6,337, వైరాలో 2,499కు చెందిన 5,402 ఎకరాల్లో పంటుల నష్టం జరిగింది. మధిర డివిజన్‌లో 97గ్రామాలు, సత్తుపల్లి డివిజన్‌లో 49, వైరా డివిజన్‌లో 30, కూసుమంచి డివిజన్‌లో 50, ఖమ్మం డివిజన్‌లో 12 గ్రామాలలో రైతులు పంటలపొలాలు ముంపునకు గురయ్యాయి. వ్వయసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. కురిసిన భారీవర్షాలకు తమ పంటపొలాలు ముంపునకు గురై పనికిరాకుండా పోయాయని జిల్లా రైతుల కన్నీటిపర్యం తమవుతున్నారు. ఖమ్మంజిల్లాలో దాదాపు 90శాతం వరినాట్లు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల నార్లు వేయడా నికి సిద్ధంగా ఉన్నాయి. వరినాట్లు వేసి నెలన్నర సమ యం అవతున్నందున భారీ వరదలకు ఆ నారంతా కొట్టుకుపోయి తీవ్ర నష్టం జరిగింది. పత్తి గింజలు వేసిన చోట్ల మొలకెత్తిన మొక్కలు నాటిన మిర్చి మొక్కలు వరదకు కొట్టుకుపోయాయి. పొలాల్లో మట్టి ఇసుక మేటలు వేయడంతో రెండు రోజుల భారీవర్షానికి ఇంకా తమ పంట పొలాల్లో నీటి నిలవులు ఉన్నాయని దానితోపాటు తీవ్ర కొట్టుకు వచ్చిన మట్టి, ఇసుక మేటలు తొలిగిస్తేనే తిరిగి పంటలు వేసుకోవడానికి అనుకూలం గా ఉంటుదని రైతులు పేర్కొంటున్నారు.

అపారనష్టం మిగిల్చిన వరద

- దెబ్బతిన్న రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 2: రెండు రోజులుగా కురిసిన వర్షానికి పాల్వంచ మండలంలో పలుచోట్ల రోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయి. ఉల్వనూరు, మందరెరికలపాడు ప్రదాన రహదారి రాళ్లవాగు నీటి ప్రవాహానికి దెబ్బతిన్నది. ప్రస్తుతం రాకపోకలు కూడా నిలిచిపోయాయి. రేగులగూడెం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా నీటి కోతకు గురైంది. అంతర్గత రహదారులు ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసిన రోడ్లు గుంతలు పడి నీటితో నిండిపోయాయి. సుమారు కోటి రూపాయల పైగా రోడ్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలతో ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. కిన్నెరసాని నుంచి ఉల్వనూరు వరకు ప్రధాన రహదారి ఇరు వైపులా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు నీటి ప్రవాహంతో దెబ్బతిన్నాయి. 13 ట్రాన్స్‌పార్మర్లు పనికి రాకుండ పోయినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మొత్తంగా 54 విద్యుత్ పోల్స్ విరిగిపోయాయి. 63కేవీ ట్రాన్స్‌పార్మర్ నుంచి 15 ట్రాన్స్‌పార్మర్ వరకు వరద ముంపునకు గురయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతినడం వల్ల రూ. 25లక్షలు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌పార్మర్ ఏడీ తెలిపారు.



దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్

దెబ్బతిన్న రాళ్లవాగు ప్రాజెక్టు

రాళ్లవాగు ప్రాజెక్టుకు నష్టం జరిగింది. ఎద్దుగుట్ట పక్కన రాళ్లవాగు పికప్‌డ్యాంకు నీరు చేరడంతో పొంగి ప్రహించడం వల్ల అలుగు పూర్తిగా దెబ్బతిన్నది. కాలువలు కొట్టుకుపోయాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో రాళ్లవాగు ప్రాజెక్టుకు ఉండడంతో ఇప్పుడు మరమ్మతులు సాధ్యపడ దని అధికారులు తెలిపారు. తాత్కాలికంగా పనులు చేపించే ప్రయత్నం చేపడతామన్నారు. మండలంలోని కిన్నెర సాని, రాళ్లవాగు, లొద్దిగండి, మొర్రేడు ప్రవాహాల వల్ల సుమారు 1500 ఎకరాల వరకు పంట నష్టం జరిగింది. ఉల్వనూరు గ్రామపంచాయతీలోని వరి, పత్తి 400 ఎకరాల వరకు నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



రేగులగూడెం వద్ద నీటికోతకు కొట్టుకుపోయిన రోడ్డు

పునరావాస కేంద్రాల్లో సీడీఎంఏ డైరెక్టర్ తనిఖీ



బాధితులతో మాట్లాడుతున్న వీపీ గౌతమ్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 2: ఖమ్మం పూర్వ కలెక్టర్, రాష్ట్ర మున్సిపల్‌శాఖ డైరెక్టర్ వీపీ గౌతమ్ తనదైన మార్క్ పరిశీలన మరోసారి నిరూపించారు. మున్నేరు వరదలో బాధితులకు అందుతున్న సేవల్ని స్వయంగా క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు సోమవారం వీపీ గౌతమ్ ఖమ్మానికి చేరుకున్నారు. పునరావాసంలో బాధితులతో మాట్లాడుతున్న సమయంలో కేఎంసీ ఇంజనీరింగ్ అధికారుల చెప్పిన బాధితుల లెక్కలకు సీడీఎంఏ డైరెక్టర్‌కు కనిపించిన బాధితుల లెక్కలకు సరిపోలేదు. దీంతో పునరావాస కేంద్రంలోని రికార్డును పరిశీలించగా ఇంజనీరింగ్ అధికారుల బాగోతం పయటపడింది. తక్కువ మంది బాధితులు పేర్లు నమోదు చేసి ఉంటే వేలాదిగా పునరావాస లెక్కలను చూపించిన తీరు నేరుగా సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ కంటపడింది. దీంతో ఏఈ శ్యామ్ మనోహర్‌పై ఈఈ కృష్ణలాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రానికి ఎంతమంది వస్తే అంతే లెక్కలు చూపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరద బాధితులను ఆదుకోవడంలో

ప్రభుత్వం విఫలం

- నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశ్రయులకు అండగా ఉంది
- రిటైనింగ్‌వాల్‌కు నిధులు మంజూరైనా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎంపీ వద్దిరాజు, మాజీమంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 2: ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మున్నేరు వరద పాపం ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం నగరంలో మున్నేరు వరద ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించి బాధితులతో వారు మాట్లాడారు. అనంతరం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంత పెద్దఎత్తున విపత్తు సంభవించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఖమ్మం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాదితులను ఆదుకోవడంపై చర్యలుతీసుకోవాలి డిమాండ్ చేశారు. ప్రతి ఏటా మున్నేరుకు, భద్రాచలానికి వరదలొస్తాయని దానివల్ల వేలాది కుటుంబాలు నిరాశ్రయలవుతారని మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.698 కోట్లు మంజూరుచేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9నెలలు గడిచినా ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడంతో వారి నిర్లక్ష్యంతో ఎందరో నిరాశ్రయులయ్యారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హెలికాప్టర్లను సైతం అందుబాటులో ఉంచారన్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ నిర్వాహకంతో వరదలతో ఖమ్మంజిల్లాలో 9మంది చనిపోవడం బాధాకరమన్నారు. శాస్త్రవేత్త అశ్వని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వద్దిరాజు, పువ్వాడ డిమాండ్ చేశారు. నిరాశ్రయులకు పునరావాసకేంద్రాలు ఏర్పాటుచేసినా అందులో సౌకర్యాలు కలిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు పట్టించుకోవడలేదని పేర్కొన్నారు. జిల్లాకు ముగ్గురుమంతులున్నా ఏం లాభం ఉందని ప్రశ్నించారు. ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయ లోపంతో పేదలు కట్టుబట్టలతో మిగిలారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గోదావరి, మున్నేరులకు ప్రతిఏటా వరద వస్తుందని తెలిసినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అధికారుల సమన్వయ లోపంతో వరదల్లో చిక్కుకున్న బాదితులు కట్టుబట్టలతో వెల్లిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రజల ప్రాణాలే కాక ఆస్తుల సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం బట్టి తక్కువ నష్టంతో పలు కుటుంబాలు ఉండిపోయాయన్నారు. ప్రస్తుతం మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో భారీ నష్టం సంబవించిందన్నారు. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు, ఇళ్లు కోల్పోయిన వారికి రూ.10లక్షలు , పాక్షికంగా ఇల్లు ధ్వంసమైన వారికి రూ.5లక్షలు నిరాశ్రయలైన ప్రతికుటుంబానికి రూ.2లక్షలుతో పాటు నిత్యావసర వస్తువులు అందించాలని, ఈమేరకు ఖమ్మం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్‌రెడ్డి, నాయకులు గుండాల కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరావు, వలరాజు, దండా జ్యోతిరెడ్డి, నాయుకలు తోట రామారావు, శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

మున్నేరు తగ్గుముఖం

- రాత్రి 8గంటల వరకు 13.5 అడుగులకు తగ్గుముఖం
- మరో రెండు రోజులు వర్షసూచన



ఖమ్మం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ఒక్కసారిగా మున్నేరుకు వరద ఉధృతి పెరగ్గా.. ఆదివారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఆదివారం ఉదయం 6 గంటలకు 22 అడుగులు ఉన్న మున్నేరు ఎగువనుంచి వరదనీరు చేరడంతో వేగంగా పెరుగుతూ వచ్చింది. ఆదివారం ఉదయం 7.30 గంటలకు 26, 11.30 కు 27.5 అడుగులకు చేరగా.. సాయంత్రం సమయానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా అది 36 అడుగులకు చేరింది రాత్రి 8.30 వరకు అదేస్థాయిలో కొనసాగింది. ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పట్టిన మున్నేరు రాత్రి 9.30కు 31కు తగ్గింది. అప్పటి నుంచి ప్రతీ అర్ధగంటకు అరడుగుమేర తగ్గుతూ సోమవా రం మధ్యాహ్నం రెండు గంటలకు 18.5 అడుగులకు, 3 గంటలకు 17.5 అడుగులు, సాయంత్రం 5 గంటలకు 15.5 8 గంటలకు 13.5 అడుగులకు చేరగా.. తగ్గుదల కొనసాగింది.

మరో రెండు రోజులు వర్షసూచన

గడిచిన రెండురోజులపాటు కురిసిన వర్షాలకే రాష్ట్రం అతలాకుతలమవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు వర్షం పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాకు ఉరుములతో కూడిన సాధారణ వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సోమవారం విడుదల చేసిన బులెటెన్‌లో పేర్కొంది.

ప్రాణాలతో ఉంటామనుకోలేదు..

కిన్నెరసాని వాసులు

పెద్దబోయిన అనసూర్య, భూషయ్య



వృద్ధ దంపతులు అనసూర్య, భూషయ్య

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 2: కిన్నెరసాని జల ప్రళయంలో చిక్కుకుని వృద్దులు మృత్యుంజయులుగా బయటపడ్డారు.. మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన పెద్దబోయిన అనసూర్య, భూషయ్య ఇరువురు కిన్నెరసాని ప్రాజెక్టు సమీపంలోని ఒడ్డు ప్రాంతంలో నివసిస్తుంటారు. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న మయంలో నీటి ప్రవాహం ఇంట్లోకి చేరింది. తొలిఊపు లోనే మమ్ముల్ని నీళ్లు ఉధృతిలో కొద్ది దూరం కొట్టుకుపో యామని ఆ వృద్దులు వాపోయారు. చిమ్మచీకట్లో కొట్టుకుపోతున్న క్రమంలో తామిద్దరం ఒడ్డుకు చేరాలని ఆతృత పడుతున్న క్రమంలో స్థానికుడైన కేశవరావు నీటిలో ఈదుకుంటు తమ వద్దకు వచ్చి బయటకు తీసుకొచ్చారని వృద్దులు తెలిపారు. ప్రాణాలతో బయటపడతామనుకోలేదని అన్నారు. 50 ఏళ్లలో ఇటువంటి వరద ఉధృతి ఎప్పుడు చూడలేదని ఏడ్చారు. ఇంట్లో సర్వం కొల్పోయినట్లు తెలిపారు.

ఎన్డీఆర్ఎఫ్ @ 60



ఖమ్మంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఖమ్మం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఖమ్మం నగరం అంతా జలమయంగా మారింది. లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించినప్పటికీ కొన్ని చోట్ల ప్రజలు నీళ్లల్లోనే చిక్కుకుపోయారు. ఈ క్రమంలో వారిని కాపాడేందుకు ఖమ్మం కార్పొరేషన్ లోని అధికారులను ఐదు బృందాలుగా ఏర్పాటుచేసి ముంపునకు గురైన ప్రాంతాలనుంచి ప్రజలను బయటకు తరలించారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. 21 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం ఖమ్మం రాగా ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో వారు అధికారులతో కలిసి సుమారు 60 కుటుంబాలను కాపాడారు.

గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం

- గంగారంలో అశ్రునాయనాల మధ్య తండ్రి, కూతురి అంత్యక్రియలు పూర్తి
- నాయకన్‌గూడెంలో యాకూబ్ మృతదేహం లభ్యం ఇంకా లభించని ఆయన భార్య ఆచూకి

కారేపల్లి/కూసుమంచి, సెప్టెంబరు 2: మహబూబాబాద్ జిల్లా మరిపేడ మండలంలోని అకేరువాగులో కారుతో పాటు కొట్టుకు పోయిన మృతిచెందిన మండల ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రీకూతుళ్లు నునావత్ మోతిలాల్, అశ్వని మృతదేహలకు సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున వాగులో ఇద్దరూ కొట్టుకుపోగా అశ్విని మృతదేహం అదేరోజు మధ్యాహ్నం లభించగా తండ్రి మోతిలాల్ మృతదేహం సోమవారం ఉదయం లభించింది. దాంతో ఇద్దరి మృతదేహాలను గంగారం తండాకు తీసుకురావడంతో బంధువులు, పరిసరప్రాంతాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధిత కుటుంబ సభ్యులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పరామర్శించారు. అయితే ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వచ్చిన సమయంలో కొందరు గ్రామస్థు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చనిపోతే ఈరోజు వచ్చావంటూ నిలదీసేందుకు ప్రయత్నించారు.




మోతీలాల్, అశ్వని మృతదేహాలు

యాకుబ్ మృతదేహం లభ్యం

పాలేరు వరదల్లో ఆదివారం గల్లంతైన కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్(50) మృతదేహం సోమవారం లభ్యమైంది. అయితే భార్య సైదాబీ(45) ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు షరీఫ్ కూడా వరదల్లో కొట్టుకపోతుండగా పోలీసులు అతడిని రక్షించిన విషయం తెలిసిందే.. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచే సమయానికి ఇంటిని వరద చుట్టుముట్టడంతో యాకుబ్ భార్య కుమారుడితో ఇంటిపైకప్పు ఎక్కారు. ఏడుగంటలపాటు వరద నుంచి బయటపడేందుకు పోరాడి చివరకు ఇల్లుకూలిపోవడంతో కొట్టుకపోయారు. సోమవారం యాకుబ్ మృతదేహాన్ని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించి వెలికితీశారు. భార్య సైదాబీ కోసం గాలిస్తున్నారు. నాయకన్ గూడెంలోనే యాకుబ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.



యాకూబ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పొంగులేటి

యాకుబ్‌కుటుంబానికి అండగా ఉంటా: పొంగులేటి

పాలేరు వరదనీటిల్లో చిక్కిన యాఖుబ్ కుటుంబాన్ని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించా.. కానీ దుర దృష్టావశాత్తు దక్కించుకోలేకపోయాం. అయినప్పటికీ మృతుల కుటుంబానికి అండగా ఉంటూ అన్నివిధాలుగా సాయపడతానని రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నాయకన్‌గూడెం గ్రామంలో యాఖుబ్ మృతదేహాన్ని సందర్శించిన మంత్రి తీవ్రదిగ్భ్రాంతికి లోనయ్యారు. మృతిచెందిన దంపతుల ఇద్దరు కుమారులను అన్నిరకాలుగా ప్రభుత్వపరంగానూ, స్వయంగానూ అండగా ఉంటానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు ఏడాది జైలు

ఖమ్మంలీగల్,సెప్టెంబరు3: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఖమ్మం రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియా తీర్పు వెలువరించారు. మెదక్ జిల్లా అంథోని మండలం జోగిపేటకు చెందిన డ్రైవర్ మహ్మద్ జిలాని వ్యాన్ నడుపుకుంటూ 2015న ఖమ్మం జిల్లా ఎదులాపురం మీదుగా వెళుతున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి.. వారిలో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలై మరణించారు. మృతుడి తమ్ముడు గుంతేటి రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో ఛార్జ్‌షీట్ నమోదు చేయగా పూర్తిస్థాయి విచారణ అనంతరం తుదితీర్పును విడుదల చేశారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి వ్యక్తి మరణానికి కారణంతో పాటుగా మరో వ్యక్తులకు గాయాలు కావటానికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షను ఖరారు చేశారు.





మునలిమడుగులోని ఓ వరిపొలంలో ఇసుక మేటలు, దెబ్బతిన్న మధిర-అంబారుపేట రోడ్డు, తెల్లపాలెం రోడ్డుపై భయంభయంగా ప్రయాణం

బాధితులకు అండగా ఉంటాం..

- అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తాం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
- అక్రమ కట్టడాలతోనే వరద ముంపు ఉందని స్థానికుల ఫిర్యాదు

ఖమ్మంసంక్షేమ విభాగం, సెప్టెంబరు2: మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు బాధితులకు తోడుగా నిలుస్తారని ఎవ్వరు ఎటువంటి భయందోళనలు చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలకు భరోసా కల్పించారు. సోమవారం ఖమ్మం నగరంలో 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌తో పాటుగా ప్రకాశ్‌నగర్, ఇతర మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి తుమ్మల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. విద్యుత్, ఇతర సమస్యలపై బాధితులు ఫిర్యాదులు చేయటంతో విద్యుత్, అగ్నిమాపక జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఖానాపురం చెర్వు అలుగు వాగు అక్రమణ జరగటంతో లకారం ట్యాంకుకు వెళ్లాల్సిన వరద నీరు కవిరాజ్‌నగర్, చైతన్య నగర్ వరకు అక్రమంగా కట్టడాలు నిర్మాణం చేశారని వాటిని తొలగించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల ఖానాపురం అలుగు కాల్వ వరకు వెళ్లి పరిశీలించారు. ప్రజల క్షేమం కోసం ఎటువంటి కార్యక్రమాలైనా చేస్తామని హామి ఇచ్చారు. కార్పొరేటర్లు సరిపూడి రమాదేవిసతీష్, లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు చావా నారాయణరావు, నాయకులు పద్మజారెడ్డి, నెల్లూరి సారధి, మందపేల్లి కోటి, సరిపూడి గోపి, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, రమేశ్, శివ, కొల్లి రవి పాల్గొన్నారు. సాయంత్రం కవిరాజ్‌నగర్, దంసలాపురం, కొత్త కాలనీ, ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ, మోతినగర్, మంచికంటి నగర్‌లో మున్నేరు వరద బాదితుల్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేరుగా కలుచుకున్నారు. బాధితుల నివాసాలకు వెళ్లి వారి గోడు తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మున్నేరు వరదబాధితుల సహాయార్థం ప్రముఖ వ్యాపార సంస్థ జీవీ మాల్ నిర్వాహకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రూ.10 లక్షల చెక్కును అందించారు.

నీటమునిగిన త్రీటౌన్ ప్రాంతం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని త్రీటౌన్ ప్రాంతం పూర్తిగా జలమయం అయింది. ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాలలోని ఉన్న ప్రజలు వారి ఇళ్లకు చేరుకుంటున్నారు. లారీల కార్యాలయంలో నిలిచి ఉన్న 200లారీలు నీట మునిగాయి. ఇంజన్లలో నీరు చేరి పనికిరాకుండా పోయాయి.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: వైరాలో ముంపు బారినపడిన ప్రాంతాలను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సోమవారం సందర్శించి పరిశీలించారు. సోమవరం నల్లచెరువు వాగు వరద ఉధృతితో నీటమునిగిన ఇందిరమ్మ కాలనీని ఎమ్మెల్యే సందర్శించారు. పునరావాస కేంద్రంలో అందిన సౌకర్యాల గురించి బాధితులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మునిసిపాలిటీ 12వ వార్డులోని సత్రంబజార్‌లో పర్యటించి వరదనీటితో ఇబ్బందిపడిన బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పాలేటి నర్సింహారావు, మిట్టపల్లి నాగి, బీడీకే.రత్నం, ధార్న రాజశేఖర్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, పణితి శ్రీను, పల్లపు కొండలు, సూర్యదేవర శ్రీధర్ పాల్గొన్నారు.

వైరా డివిజన్‌లో 5402ఎకరాల్లో పంటలకు నష్టం

వైరా వ్యవసాయ డివిజన్‌లో 5402ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 2500మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు ప్రభుత్వానికి నివేదించారు. 1321మంది రైతులకు చెందిన 2929ఎకరాల్లోని పత్తి పంట, 1048మంది రైతులకు చెందిన 2183ఎకరాల్లోని వరిపైరు, 130మంది రైతులకు చెందిన 290ఎకరాల్లోని మిర్చి దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. ముఖ్యంగా వాగులు, వంకలు, ఏర్లు పక్కనున్న వరిపొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. పత్తి పైరు మొత్తం వర్షాలతో పూత, పిందె రాలిపోయి నేలబారున పడిపోయాయి. మిర్చిమొక్కలు వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. మండలంలోని అష్ణగుర్తిలో రెండు, వల్లాపురం, పుణ్యపురం, కొండకొడిమల్లో ఒక్కో ఇల్లు వర్షాలకు దెబ్బతిన్నది. మునలిమడుగు-తాటిపూడి గ్రామాల మధ్య బీటీ రోడ్డు ధ్వంసమైంది. వాగులోని వరద ఉధృతికి ఈ రెండు గ్రామాల మధ్యనున్న కల్వర్టు కుంగిపోయి కొంతమేర కొట్టుకుపోయింది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి.



బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

తగ్గిన వర్షం తేరుకున్న ప్రజలు

మధిరటౌన్: మధిరలోని ముంపు ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లు శుభ్రం చేసుకునే పనిలో ఉన్నారు. వరద ముంపునకు గురైన లడక బజార్, శ్రీనగర్ కాలనీ ప్రజలు వరద తగ్గటంతో ఇళ్లు శుభ్రం చేసుకున్నారు. హనుమాన్ కాలనీ, ముస్లీం కాలనీల్లో ఇంకా కొంత భాగం ముంపులోనే ఉండటంతో ఆ కాలనీల ప్రజలు ఇంకా పునరావాస శిబిరంలోనే తల దాచుకుంటున్నారు. మధిర మునిసిపాలిటీ పరిధి లోని అంబారుపేట వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది.

కొట్టుకుపోయిన రోడ్లు...నీట మునిగిన పంట పొలాలు

బోనకల్: వరద కారణంగా బోనకల్ నుంచి ఆళ్లపాడు రోడ్డు రెండు చోట్ల కొట్టుకు పోయింది. కలకోట రాళ్ల వాగు పొంగడంతో పాటు రాయనపేట, గోవిందాపురం(ఎ), మోటమర్రి, ఆళ్లపాడు గ్రామాల వద్ద ఉన్న వాగులు వర్షాలకు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ 5 గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ముష్టికుంట్ల బీసీ కాలనీలోని ఇళ్లల్లోకి వరద నీళ్లు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీళ్లు బయటకు పంపించేందుకు అధికారులు ప్రధాన రహదారిని పగులకొట్టించారు.ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాల్లోని చెరువులకు గండి పడగా వాటిని పూడ్చించారు. కస్తూర్బా పాఠశాల ఆవరణలోకి వరద చేరింది. పత్తి, వరి పొలాలు జలమయంగా మారాయి.

భారీ వర్షానికి 3వేల ఎకరాల్లో పంట నష్టం

తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరతండా నుంచి రాసాకితండాకు వెళ్లే బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమమైంది. రాకాసితండాకు వరద నీరు చుట్టుముట్టడంతో పది ఇళ్లు పూర్తిగా ధ్వంసంకాగా, 40 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సుమారు 3వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వరి 1710, పత్తి 1070, మిర్చి 505, పెసర 100 ఎకరాల్లో దెబ్బతిన్నది. సుమారు 150 విద్యుత్‌స్తంభాలు ధ్వంసమయ్యాయి. 50 ట్రాన్సుఫారాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లుకూడా దెబ్బతిన్నాయి.

తల్లాడ మండలంలో పంటలకు తీవ్ర నష్టం

తల్లాడ: మండలంలో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని 2500 ఎకరాల్లో వరి, మరో 1900ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. నిర్మాణంలో ఉన్న మల్లవరం- గంగదేవిపాడు ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురైంది. మంగాపురం వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జి కూడా కోతకు గురైంది. ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలైన లారీలు, వ్యాన్లను పోలీసులు సోమవారం ఉదయం నుంచి తల్లాడలో నిలిపి వేశారు. తల్లాడ-దేవరపల్లి, తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారుల్లో వాహనాలు బారులు తీరాయి.

చెరువు గండిని పరిశీలించిన ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: తుఫాన్‌తో దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి తగిన చర్యల నిమత్తం అధికార యంత్రాంగాన్ని నియోజకవర్గ పరిధిలో అప్రమత్తం చేశామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ చెప్పారు. కల్లూరు, పెనుబల్లి మండలాల్లో సోమమవారం తుఫాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. పెనుబల్లి మండలంలోని లంకసాగర్, చింతలకుంట చెరువు, కల్లూరులోని ఇటుకరాయి చెరువుకట్టపై గండి పడిన ప్రదేశాన్ని వారు డివిజన్ స్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఇటకరాయి చెరువు కట్టపై పడిన గండిన పూడ్చివేతలో అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పడిన శ్రమను ఎమ్మెల్యే అభినందించారు. చెరువు గండి పూడ్చివేతపై ఆర్డీవో, రాజేంద్రప్రసాద్, జలనవరులశాఖ ఈఈ లక్ష్మీనారాయణలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, డీఈ రత్నాకర్, బాగం ప్రభాకరచౌదరి. ఏనుగు సత్యంబాబు, భూక్యా శివకుమార్ నాయక్, ఎస్ కే ఉస్మాన్, తురాబుఅలీ, దరవత్ మోహన్‌నాయక్ బైర్ల కాంతరావు ఎస్‌కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన మున్నేరు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు

చింతకాని: మండల పరిధిలోని లచ్చగూడెంలోని ఊర చెరువు, నేరడ గ్రామంలోని కొత్త చెరువుకు వచ్చిన వరదల కారణంగా సుమారు 500 పైగా ఎకరాల్లో వరి పొలాలు కొట్టుకుని పోవడంతో రైతుకు తీవ్ర నష్టం మిగిల్చింది. మత్కేపల్లి నామవరం గ్రామంలోని మున్నేరుపై ఉన్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. నేరడలోని నల్లకుంట చెరువు కట్ట కోతకు గురవడంతో అధికారులు ఇసుక బస్తాలతో మరమ్మతుల నిర్వహించారు. రామకృష్ణాపురంలో కురుగుంట్ల అప్పిరెడ్డికి వరద నీటికి వచ్చిన పాము కాటుకు గురవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

నేల కూలిన గృహాలు... రెవెన్యూ శాఖ పరిశీలిన

కల్లూరు: మండలంలో సుమారు ఐదు గృహాలు దెబ్బతిన్నాయి. ఆయా గృహాల్లో బాధిత కుటుంబ సభ్యులు నిద్ర పోతుండగా పలు గృహాల్లో మట్టి గోడలు కూలగా తృటిలో ప్రమాదం బారిన నుంచి బయట పడ్డారు. వివరిలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న జిల్లెళ్ల జయరాజు, బొల్లేపోగు సుగుణమ్మ, చంద్రుపట్లలో జినుగు వినోద్, ఖాన్‌ఖాన్‌పేటలో పిట్టల చిన్నకృష్ణలకు సంబంధించి అదే క్రమలో సోమవారం ఉదయం చిన్నకోరుకొండి మరో ఇంటి గోడ, పై కప్పు కూలి దెబ్బతిన్నాయి. దీంతో నేలకొరిగిన గృహాల్లో వంటసామాగ్రి, గృహఅవసరాల వస్తువులకు కూడ పాక్షికంగా నష్టం జరిగింది.

గురుకుల పాఠశాలలు తనిఖీ చేసిన జిల్లా సీపీవో శాంతిశ్రీ

మధిర: సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలున్నందున విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీవో) మధిర స్పెషల్ ఆఫీసర్ శాంతిశ్రీ గురుకుల అధికారులకు సూచించారు. ఆమె సోమవారం మధిర పర్యటన చేశారు. కృష్ణాపురంలో ఉన్న సాంఘీక సంక్షేమశాఖ, బీసీ వెల్ఫేర్, మైనార్టీ గురుకులాలను తనిఖీ చేశారు. ఒకే చోట వున్న మూడు గురుకుల పాఠశాలలను పరిశీలించారు.

భారీ వర్షాలతో రైతన్నల పంటలకు తీవ్రనష్టం

మధిరరూరల్: మండల పరిధిలోని రామచంద్రాపురం, మల్లారం, జాలిముడి గ్రామాల్లో రైతుల పత్తి పొలాల్లోకి నీళ్లు బురదపట్టి బాగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య, ఏడీఏ విజయచంద్ర సందర్శించి రైతులతో మాట్లాడారు.

మూగజీవాల మృత్యువాత

ఖమ్మంరూరల్: మండలంలో వచ్చిన వరదల మూలంగా జరిగిన సంఘటనలు. మండలంలోని కస్నాతండా, వాల్యాతండా, రాజీవ్ గృహకల్ప, జలగంనగర్, నాయుడుపేట, తదితర ప్రాంతాలు వరద ముంపులో మునిగాయి. ఖమ్మం నుంచి మహబూబా బాద్ వెళ్లె ప్రధాన రహదారిపై వాల్యాతండా వద్ద ఉన్నటువంటి మున్నేరు బ్రిడ్జి కూలిపోయింది. ప్రస్తుతం పిల్లర్లు మాత్రమే మిగిలాయి. గూడురుపాడు, తనగంపాడు గ్రామాల మధ్య రోడ్డు కొట్టుకు పోయింది. దీంతో ఖమ్మం, కోరవి, మహబూబాబాద్‌లకు రాకపోకలు నిలిచి పోయాయి. రేగుల తండా నుంచి ములకలపల్లి వెల్లే రహదారి మొత్తం వరద ప్రవాహనికి కొట్టుకుపోయింది. జలగంనగర్ సమీపంలో మున్నేరు వంతెన వద్ద రోడ్డు అంచులు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వరంగల్, ఖమ్మం ప్రధాన రహదారిపై కొంతసేపు రాస్తారోకో చేపట్టారు. ఎటువంటి సహాయం అందించలేదన్నారు. మండలంలోని రాజీవ్ గృహకల్ప, నాయుడుపేట, జలగం నగర్, సాయిప్రబాత్ నగర్, కరుణగిరి, పెద్దతండా తదితర గ్రామాల్లో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి పర్యటించారు. బాధితులను ఓదార్చారు.ఎవరు అధైర్యపడవద్దని సూచించారు. కలెక్టర్ ముజేమిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని బాధితులకు భరోసా కల్పించారు. ముంపు ప్రాంతాల్లో వెంటనే పారిశుధ్య పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కస్నాతండా, వాల్యాతండా,రాజీవ్ గృహకల్ప, జలగంనగర్ తదితర ముంపు ప్రాంతాల్లో సీపీఎం, సీపీఎం నాయకులు పర్యటించారు. భోజనాలు అందజేశారు. సీపీఐ నాయకులు బాధితులను పరామర్శించారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు.

వరదతో అంత్యక్రియలకు కష్టం

మధిర: తుఫాన్ వచ్చి యావత్ ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేసింది. చివరికి ఓ పేద రిక్షాకార్మికుడు మరణిస్తే అంత్యక్రియలకు స్థలం లేకుండా పోయింది. దీంతో దిక్కులేకున్న ఆ కుటుంబాన్ని స్థానికులు ఆదుకున్నారు... మధిర పట్టణం ఎంప్లాయీస్ కాలనీలో కుంచెం నాగయ్య (65) రిక్షా కార్మికుడుగా జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అనారోగ్యంతో నాగయ్య ఆదివారం మరణించాడు. అయితే కాలనీ అంతా వరద నీరు చుట్టుముట్టింది. అంత్యక్రియలకు స్థలం లేక వేరే దారిలేక స్థానిక పెద్దలను ఆశ్రయించారు. కౌన్సిలర్ యర్రగుంట రమేష్, కందుల రాంబాబు, గౌస్, మునుగోటి నర్సింహారావు తదితరులు ఆర్‌కే అనాథ ఫౌండేషన్ రామకృష్ణకు పరిస్థితిని వివరించారు. గ్రామపెద్దలు బీఆర్ఎస్ నాయకులు కొటారి రాఘవరావు సహకారంతో జిలుగుమాడు గ్రామానికి చెందిన వారి స్థలంలో దాతల ఆర్థిక సహకారంతో ఖననం చేశారు. సహకరించిన అనాథ ఫౌండేషన్ రామకృష్ణకు, జిలుగుమాడు పెద్దలకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సదా బాధితుల సేవలో ప్రజాప్రతినిధులు




డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న చావా నారాయణరావు, మంచినీళ్ల పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సరిపూడి రమాదేవిసతీష్

ఖమ్మంసంక్షేమ విభాగం, సెప్టెంబరు 2: భారీ వర్షాలు సోమవారం కొంత ఎడతెరప ఇవ్వటంతో డివిజన్లలో కార్పొరేటర్లు ఒక వైపు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరో వైపు ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను అందించారు. 10వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు డ్రెయిన్లు శుభ్రం చేయించారు. 11వ డివిజన్‌లో కార్పొరేటర్ సరిపూడి రమాదేవిసతీష్ తాగునీరు అందజేశారు.

గణపతి మట్టి విగ్రహాలపై వరద



ఖమ్మంఖానాపురం హవేలి, సెప్టెంబరు2: భారీవర్షాల కారణంగా ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్‌లో మట్టి గణపతుల విగ్రహాలు గడిసి ముద్దైనాయి. ఖమ్మంనగరానికి చెందిన కొందరు కలకత్తా కళాకారులచే మట్టివిగ్రహాలను తయారు చేయించి విక్రయించాలని 55 విగ్రహాలను తయారు చేయించారు. వీటిలో 45 విగ్రహాలు బుకింగ్‌కాగా 10 విగ్రహాలు బుకింగ్ కావాల్సి ఉంది. వీటికి రూ.20 లక్షలు వరకు పెటుబడి పెట్టినట్లు నిర్వాహకులు గూడురి దయాకర్ తెలిపారు. విగ్రహాలకు పెయింటింగ్ పనులు పూర్తిచేశామని, కార్మికులుకు మొత్తం డబ్బులు చెల్లించామని తెలిపారు. బుకింగ్ అయిన విగ్రహాలకు తిరిగి అడ్వాన్స్‌లు ఇవ్వమని అడుగుతున్నారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వరదకు కొట్టుకుపోయిన చేప పిల్లలు

చింతకాని, సెప్టెంబరు 2: మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన మత్స్యసంఘ సభ్యులు రూ.3.20 లక్షలు వెచ్చించి చేప పిల్లలను జులైలో చెరువులోకి వదిలారు. వరద రావడంతో మత్స్యకారులు ఏర్పాటు చేసిన రక్షణ వల తెగిపోయి చేపపిల్లలన్ని దిగువకు కొట్టుకుపోయాయి. రాత్రి సమయంలో అకస్మాత్తుగా వరద రావడంతో ఏమిచేయలేక పోయామని మత్స్య సంఘ చైర్మన్ గొడుగు రమేష్ కోరారు.

మునిగిన పంటలను పరిశీలించిన జేడీఏ

ఎర్రుపాలెం, సెప్టెంబరు2: మండలంలో భారీ వర్షాలకు నీటమునిగిన పంటలను జిల్లావ్యవసాయధికారి డి.పుల్లయ్య సోమవారం పరిశీలించారు. మీనవోలు క్లస్టర్ పరిధిలో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. మండలంలో పత్తి 5400ఎకరాలు, వరి 5700, మిరప 350, బొప్పయి40, అరటి 20, కూరగాయలు 20 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు తాగునీటి సరఫరా

ఖమ్మంటౌన్,సెప్టెంబరు2:భారీవర్షాలతో వచ్చిన వరదల వల్ల మున్నేరులోని ఫిల్టర్‌బెడ్స్ మునిగిపోవటంతో వరద బాధితులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని 41వ డివిజన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ ఈ విషయాన్ని నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తెచ్చారు. డివిజన్‌లోని చెరువుబజార్, తుమ్మలగడ్డ వరదనీటిలో మునిగిపోవటంతో అక్కడి ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలపటంతో వాటర్‌ట్యాంక్‌ను పంపించారు. దీంతో కార్పొరేటర్ తాగునీటిని ప్రజలకు పంపిణీ చేశారు.

బాధితులకు బీజేపీ ఆధ్వర్యంలో భోజనాలు

ఖమ్మంబైపాస్‌రోడ్,సెప్టెంబరు2: బీజేపీఆధ్వర్యంలో వరద బాధితులకు భోజనాల పంపిణీ చేశారు. బీజేపీ అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, మోతినగర్ ప్రాంతాల్లోని సుమారు 500మందికి భోజనాలు అందించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయన, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, అనిత, ఫణికుమారి, నీలిమ, శ్యామ్, చావా కిరణ్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

ఖమ్మంటౌన్: నగరంలోని కాల్వొడ్డు వేంకటేశ్వర కాలనీలో మున్నేరు బాధితులకు ఏఐఎస్ఎఫ్ జిల్లా బృందం సోమవారం ఇంటింటికి తిరిగి ఆహార పదార్థాలు, తాగునీరు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జిల్లా సమితి కార్యదర్శి రామకృష్ణ, పోటు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో...



మున్నేరు బాధితులకు ఐఎంఏ అండగా నిలిచింది. ఆదివారం రాత్రి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు తాగునీరు, భోజనం, మందులు అందజేశారు. సోమవారం కరుణగిరి ప్రాంతంలో సుమారు 1000 మందికి భోజనాలు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు కంభంపాటి నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కే. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటన

ఖమ్మంటౌన్,సెప్టెంబరు 2: అధికారుల నిర్లక్ష్యం, అంచనా వేయటంలో వైఫల్యం వల్లే ఖమ్మం నగరంతో పాటు మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు భారీగా నష్టపోయారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. సోమవారం నగరంలో ముంపుకు గురైన వేంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, సారధినగర్,పంపింగ్‌వెల్ రోడ్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాలను సీపీఐ బృందం సందర్శించారు. ముంపు ప్రాంతాలను సందర్శించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వేంకటేశ్వరరావు,మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు సాంబశివారెడ్డి, శశిధర్ ఉన్నారు.

బాధితుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి: మాస్‌లైన్

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు 2: మున్నేరు ముంపు ప్రాంతాల్లో సోమవారం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ బృందం పర్యటించారు. నష్టంపై ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. మున్నేరు ముంపుకు అధికారులే బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ముంపు ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తే నిత్యవసరాలను కాపాడుకు నేవారన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటించిన మార్తినేని

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు2: నగరంలోని వరద ప్రాంతాల్లో బీజేపీ రాష్ట్రక్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీశాసనసభ్యులు మార్తినేని ధర్మారావు మంగళవారం పర్యటించారు. బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, చావా కిరణ్, కొణతం లక్ష్మీనారాయణ కుమిలి శ్రీనివాస్, అనిత, పాల్గొన్నారు.

జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్: నగరంలోని 47డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో ని వరద బాధితులకు జమాతే ఇస్లామి హింద్ ధ్వర్యంలో భోజనం అందజేశారు.సంస్థ రాష్ట్రమాజీ కార్యదర్శి మహ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ మున్నేరు వాగు రిటైనింగ్‌వాల్ నిర్మించాలన్నారు.

మాజీ సీఎం వైఎస్ఆర్‌కు మంత్రులు భట్టి, తుమ్మల నివాళి



వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు2: నిరుపేదలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశ పెట్టిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు దక్కుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో సోమవారం వారు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, మలీదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నివాళులర్పించారు.




నివాళులర్పిస్తున్న దయానంద్, రాగమయి, ఎమ్మెల్యే రాందాస్

కొణిజర్ల కేజీబీవీలో గోడల నుంచి విద్యుత్‌షాక్

- భయాందోళనలకు గురైన విద్యార్థినులు
- ఇంటికి తీసుకు వెళ్లిన తల్లిదండ్రులు



కొణిజర్ల: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని బస్వాపురంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గోడలకు విద్యుత్ ప్రసరణ కావడంతో విద్యార్థినిలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. సోమవారం ఉదయం పాఠశాలలోని రెండు గదుల్లో గోడల నుంచి విద్యుత్‌షాక్ వస్తుండటంతో బాలికలు ఆందోళనకు గురై తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఈ పాఠశాలలో 299 మంది బాలికలు చదువుతున్నారు. తాజా సంఘటనతో దాదాపు అందరూ ఇంటిదారి పట్టగా చివరకు 25 మంది బాలికలు మిగిలారు. పాఠశాలను సక్రమంగా పట్టించుకోకపోవడం వలనే ఈ సమస్య తలెత్తిందని, గదులకు అసలు షాట్ సర్క్యూట్ రావడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల వారు విషయాన్ని బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల విద్యాశాఖాధికారి మోదుగు శ్యాంసన్ సందర్శించారు. గదులు తడవటం వలన ఎర్త్ వస్తోందని, బాలికలు ఆందోళనతో ఇంటికి వెళ్లారని తెలిపారు. మిగిలిన బాలికలతో మాట్లాడానని ఎటువంటి భయం లేదన్నారు. బాలికలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎర్త్ రావడంపై పరిశీలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏంఈవో మాట్లాడుతూ షాట్‌సర్క్యూట్ ఎందుకు వస్తుందో పరిశీలించి నివారణ చర్యలు చేపడతామన్నారు.